# వ్యాస కౌముది



## మనభారతం

డా.వల్లూరుపల్లి శివాజీరావు

80

**తొలి మాట:** *ప్రపంచ పాఠకులను విశేషంగా ఆకర్షించి, ఆకట్టుకుని, వారిచేత ఆదరించబడుచున్న, అసమాన తెలుగు మాస పత్రిక "**కౌముది**' లో ప్రచురితమైన నా 'మనభారతం' వ్యాసం జనవరి 2010 నుండి డిసెంబర్ 2015 వరకు నిరాటంకంగా 72 నెలలు ప్రచురితమయింది.* కాని సమయాభావం వల్ల జనవరి 2016 నుంచి కొన్ని బాధ్యతలవల్ల ఈ వ్యాసాలు కొనసాగించుటకు వీలుకాలేదు.

*ఇప్పుడు సమయం దొరికినందువల్ల 'కిరణ్ ప్రభ' గారి సమ్మతితో భారత విశేష చరిత్ర ను ప్రతిబింబించే ఈ 'మన భారతం' వ్యాసం మళ్ళీ కొనసాగిస్తున్నాను.*

# చేజారిన భారతదేశ రత్నరాజములు-8



### ఘనమైన పెద్ద వజ్రం (The Great Mogul Diamond)

ఆంధ్రప్రదేశ్ లోని కొల్లూరు-పరిటాల వజ్రగనులనుంచి బయల్పడిన మరొక వజ్రరాజం **"ఘనమైన పెద్ద వజ్రం"**. "ది గ్రేట్ మొఘల్ వజ్రం" (The Great Mughal Diamond) గా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన వజ్రం గనులనుంచి ఎప్పుడు బయల్పడిందో కాని, ఈ వజ్రం గురించిన వివరములు కొన్ని మాత్రమే నిక్షిప్తమైనాయి.

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఈ వజ్రం 1550లో గాని, అంతకుముందు ముందు గాని లభించిందని ఇప్పటివరకు దొరికిన ఆధారాల ప్రకారం నిర్ణయించబడింది. అప్పటి గోలుకొండ సామ్రాజ్యం సుల్తాన్ "ఇబ్రహీం క్కులి క్కుతబ్ షా" (Ibrahim Quli Qutb Shah: 1550-1580) స్వాధీనంలో ఉన్న ఈ వజ్రం బరువు 787 ½ క్యారెట్లు. ఒక పెద్ద కోడిగ్రుడ్డు ఆకారంలో ఉన్న ఈ అద్భుత వజ్రం భారతావనిలో బయల్పడిన అన్ని వజ్రాల కంటే పెద్దది.

సుల్తాన్ అబ్దుల్లా క్కుతబ్ షా (Abdullah Qutb Shah) పాలనా కాలంలో (1626-1672) ఆయన సంస్థానంలో ఒక ఇరానియన్ వర్తకుడు "మీర్ జుమ్లా" (Mir Jumla) ఒక వజ్రాల వ్యాపారస్తుడివద్ద గుమాస్తా ఉద్యోగం చేసేవాడు. క్రమ క్రమం గా వజ్రాల నిపుణిడిగా మారిన ఇతను సుల్తాన్ ప్రాపకం సంపాదించి చివరకు ఆయనకు ప్రధాన మంత్రిగా కూడా ఉండేవాడు. ఇతను ఫ్రాన్స్ కు చెందిన వజ్రాల వ్యాపారి Jean-Baptiste Tavernier (1605–1689) 1651-1668 మధ్య మూడుసార్లు భారత్ కు వచ్చి అనేక చోట్లకు వెళ్లి చివరకు గోలుకొండ సంస్థానంలో కొంతకాలం

ఉన్నాడు. ఆసమయంలో మీర్ జుమ్లా, టావెర్నియర్ తో స్నేహం ఏర్పడి తద్వారా కొన్ని విలువైన వజ్రాలను 1656లో దొంగిలించాడు. వీటిల్లో ది గ్రేట్ మొఘల్ వజ్రం కూడా ఉంది.

ఈ దొంగతనం ద్వారా నవాబు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేసాడు. పారిపోవడానికి మరొక కారణం సుల్తాన్ తల్లితో ఉన్న కామ–సంబంధం బహిర్గతం కావటం, తద్వారా కలిగిన ప్రాణ భీతి.

దొంగిలించిన వజ్రాలను ఆగ్రాలోని మొగల్ సుల్తాన్ “షా జహాన్” (Shah Jahan) కు సమర్పించాడు. ఈ వజ్రాన్ని మీర్ జుమ్లా షా జహాన్ కు బహూకరిస్తూ “ఈ ప్రసిద్ధమైన వజ్రం ప్రమాణంలోనూ, అందంలోనూ అసమానమైనది” అని కొనియాడాడు.

ఈ వజ్రంలో కొన్ని అనవసరమైన "చేరికలు" (inclusions) ఉండి దాని కాంతి తగినంతగా వెదజల్ల నందువల్ల షా జహాన్ ఒక రత్నాల నిపుణుడు "Ortensio Borgio" ను నియమించాడు. ఈ వజ్రాన్ని కత్తిరించి కాంతిని వెదజల్లే చిన్న చిన్న వజ్రాలుగా రాబట్టమని మొఘల్ సుల్తాన్ ఈ వెనిస్ (Venice) దేశస్థుడిని ఆదేశించాడు.

బోర్గియో వజ్రాన్ని ముక్కలుగా చేయక దానిని మెల్లగా అరగదీసి చేరికలను నిర్మూలించాడు. అలా చేయబడిన వజ్రాన్ని షా జహాన్ చూసి చాలా నిరాశ, అసహనం, కోపం పొందాడు. కాని నిగ్రహించుకుని బోర్గియో శిరచ్ఛేదానికి బదులు అనైపుణ్యమైన పనితనానికి 10,000 రూపాయల జరిమానా విధించాడు. ఆ సమయంలో ఈ వెనిస్ దేశస్తుడి వద్ద ఉన్నది ఈ పదివేలు మాత్రమే!!

1665 లో ఔరంగ జేబ్ ఈ వజ్రాన్ని టావెర్నియర్ కు చూపించాడు. ఇతను వజ్రాన్ని చూసి ఇలా ప్రశంసించాడు: "సుల్తాన్ ఔరంగ జేబ్ వజ్రాన్ని నా చేతిలో పెట్టినప్పుడు అది గుండ్రం గానూ, Rose Cut (క్రింద చూపించబడిన వజ్రం చూడవచ్చు) లో ఉండి, ఒక వైపు ఎత్తుగా ఉంది. దిగువ అంచున (lower end) పగులు (crack), సూక్ష్మమైన దోషం కూడా ఉన్నాయి. దీని బరువు 280 క్యారెట్లు".

ఈ పెద్ద వజ్రం మొఘల్ సుల్తానుల ఆదీనంలో ఉన్నందువల్ల "The Great Mughal Diamond గా పేరు గాంచింది.

ఔరంగ జేబ్ తరువాత కూడా మన పెద్ద వజ్రం అయన తరువాత వచ్చిన అయిదుగురు మొఘల్ సుల్తానుల సంరక్షణలోనే ఉంది. ఆ తరువాత వచ్చిన సుల్తాన్ ముహమ్మద్ షా (Muhammad Shah) పరిపాలనా కాలంలో మొఘల్ సామ్రాజ్యం క్షీణించటం ప్రారంభించింది. 1739లో పర్షియా సుల్తాన్ "నాదిర్ షా” (Nadir Shah) భారతావని మీద దండెత్తి ముహమ్మద్ షా ను ఓడించాడు. సంధి ఒడంబడికలో మొఘల్ సుల్తాన్ తన వద్ద ఉన్న వజ్రాలన్నిటిని నాదిర్ షా కు సమర్పించుకోవలసి వచ్చింది. వీటిల్లో మన పెద్ద వజ్రం కూడా ఉంది.

1747లో నాదిర్ షా హత్యచేయబడిన ఈ వజ్రం ఏమయిందో తెలియదు. కొన్ని ఆధారాల ప్రకారం నాదిర్ షా హత్యకు ముందు గాని, తరువాత గాని పర్షియాలోనే ఈ వజ్రం ముక్కలు ముక్కలుగా కత్తిరించబడింది. దీనికి కారణం ఇతరులకు ఈ వజ్రం జాడ తెలియకుండా ఉండటానికి గాని, లేక ఇతరుల చేతుల్లో పడకుండా ఉండటానికి గాని.

కారణం ఏదయినా ఈ మన కొల్లూరు భారీ వజ్రం భారత దేశపు చేతుల్లోంచి జారిపోయింది శాశ్వతంగా!



Diamond with a Rose Cut



కొల్లూరు పెద్ద వజ్రం (The Great Mogul Diamond)

(కొనసాగింపు వచ్చేనెలలో)

**మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com**

COMMENTS